''ఏంది ఎల్లన్నా నువ్వనేది!
చింతతోపు కాడ నాలుగురోజుల క్రితం
మోహినీ పిశాచం చేతుల్లో చచ్చిపడి
వున్న ఈరిగాడు నీక్కనిపించేడా?''
ఆ మాటని కొండయ్య అడగడం
అది మూడోసారి.
''పొద్దుగాలే ఏమన్నా భంగుగానీ
తాగినావా ఏంది? ఆడు ఇందాకట్నుంచీ
చెవిలో ఇల్లు కట్టుకుని
మరీ చెప్తున్నాడు, ఈరిగాడు ఈరిగాడు
అంటూ! అయినా అదే మాట మళ్లీ మళ్లీ
అడుగుతావేంది?'' అని కసురుకుంటూ
డబ్బాచొక్కా జేబులోంచి గంట పుగాకు
చుట్ట బయటికి తీశాడు గోవిందప్ప.
''గోవిందప్ప మావకి కోపం వచ్చినాది''
అంటూ పకాపకా నవ్వాడు పుల్లారావు.
''లేకపోతే ఏందిరా ఈడి నసుగుడూ..''
అంటూ దీర్ఘం తీస్తూ చుట్టని ఓసారి
పరీక్షించి చూసి,
టీకొట్టు సుబ్బణ్ణి నిప్పు అడిగాడు.



# మోహిని

## అడపా చిరంజీవి

ఒక్కపెట్టున గాలి వీస్తే కూలిపోయేట్టు వుంది టీకొట్టు పెట్టిన ఆ పూరిపాక. అక్కడక్కడ తాటాకులు సగం సగం వూడిపోయి, పాక చూరు లోంచి బయటికి వేలాడుతున్నాయి.

చలిగాలి రివ్వున కొడుతోంది.

ఆ గాలి వేగానికి తాళం వేస్తున్నట్టుగా చూరు లోని తాటాకులు శబ్దం చేస్తున్నాయి.

పాకని ఆనుకుని వుంది, పెద్ద వేప చెట్టు. దాని చుట్టూ కూర్చోడానికి వీలుగా పెద్ద రాతిబండ వుంది. ఆ ఊరివాళ్లకి అదే రచ్చబండ. ఆ పల్లెలోని సమస్యల్ని, గొడవల్ని టీలు తాగుతూ తీర్చేది అక్కడే. వ్యక్తిగత విషయాలనీ, లోకాభిరామాయణాన్నీ చర్చించుకునేదీ అక్కడే.

టీకొట్టు సుబ్బడు నిప్పు తెచ్చి గోవిందప్ప చుట్ట వెలిగించాడు.

ఆనందాన్నంతా ముఖంలోకి తెచ్చిపెట్టుకుని, చుట్టపొగను గట్టిగా లోపలికి పీల్చాడు. రెండు క్షణాల తర్వాత ఎంతో హాయిగా ఫీలవుతూ పొగను రైలింజను పొగలా బయటికి వదిలాడు గోవిందప్ప. ''గంట పొగా కంటే గంటపొగాకేరా! దీనబ్బ, చుట్టంటూ తాగితే ఇట్టాంటిదే తాగాలిరా! తస్సాదియ్యా, అమృతం

# కథ


తాగినట్టుంది!'' అంటూ హుషారుగా వాళ్లవైపు చూశాడు. ''ఇప్పుడు చెప్పరా ఎల్లన్నా, ఈరిగాడు నీకు ఎక్కడ కనిపించాడు?'' అన్నాడు.

వాళ్లంతా తెల్లముఖాలు వేసుకుని చూస్తున్నారు. అప్పటి వరకూ మళ్లీ మళ్లీ చెప్పవద్దంటూ కొండయ్యని కసురుకుని కరిచినంత పనిచేసిన గోవిందప్ప, మళ్లీ అదే మాట అడిగేసరికి వాళ్లందరికీ నోట మాట రాలేదు.

''ఏందిరా ఎవడూ మాట్టాడ్డూ, మీ అందరికీ నోళ్లు పడిపోయాయా ఏంది'' అని గోవిందప్ప అనేసరికి, కొండయ్యకి పౌరుషం పొడుచుకొచ్చింది.

గోవిందప్ప ఆ ఊరు అంతటికీ పెద్ద తలకాయ. ఊరు సమస్యల్ని రచ్చబండ దగ్గర చర్చకు పెట్టి, చెరిగేసేది ఆయనే. అందుకే గోవిందప్ప అంటే అందరికీ గౌరవం కంటే భయం ఎక్కువ, వెనకా ముందు చూడకుండా అమ్మనా బూతులూ తిడతాడని! అయినా కొండయ్య వూరుకోలేదు. ''మళ్లీ మళ్ళీ అడుగుతావేందిరా అని చెప్పిందీ నువ్వే! ఈరిగాడు ఎక్కడ కనిపించేడురా అని అడిగేదీ నువ్వే!'' అంటూ నసిగాడు.

''నీయబ్బ, నాతోనే ఎకసెక్కాలాడుతున్నావ్‌రా!



## ☆☆☆☆☆☆ సాహసానికి ప్రేరణ ☆☆☆☆☆☆



మనుషుల్ని రిస్క్ తీసుకోవడానికి ప్రేరేపించే మెదడులోని భాగాన్ని ఇటీవల శాస్త్రవేత్తలు కనుగొన్నారు. షాపింగ్ చేసేటపుడు ఇదివరకెన్నడూ ఉపయోగించని వస్తువులను కొనడం దగ్గర్నుంచీ, ఇది వరకూ అలవాటు లేని గంజాయి లాంటి మత్తు పదార్థాలను వాడటం దాకా, స్కై డైవింగ్ నుంచీ, పర్వతారోహణ దాకా- మెదడులోని ఈ భాగమే మనల్ని కొత్త రిస్కులు తీసుకోవడానికి ప్రేరేపిస్తుందట. ఆ రిస్క్‌లో ఆనందాన్ని పొందేలా చేస్తుందట. దీని పేరు 'వెంట్రల్ స్ట్రియాటమ్'. ఇది విడుదల చేసే 'డోపమైన్' అనే హార్మోను మనుషుల్ని సాహసాలకు ఉసిగొల్పుతుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. లండన్‌లోని యూనివర్శిటీ కాలేజ్‌కు చెందిన ఈ శాస్త్రవేత్తలు బ్రెయిన్ స్కానింగ్ ప్రక్రియ ద్వారా కొందరు వ్యక్తుల మెదళ్ళను పరిశీలించారు. ఈ వ్యక్తులు షాపింగ్‌లో కొత్త వస్తువులు కొనడానికి ఆసక్తి చూపించినపుడు, కొత్త సాహసాలకు ఉద్యుక్తులయినపుడు మెదడులోని ఈ భాగం చురుకుగా పని చేస్తూండడాన్ని వీరు గమనించారు. కొత్త విషయాలు తెలుసుకోవాలన్న ఆసక్తే మానవ పరిణామానికి మూల కారకం కాబట్టి, మనుషులింతగా అభివృద్ధి చెందడంలో మెదడులోని ఈ భాగం పాత్ర చాలా కీలకమైనదని వారు నిర్ధారించారు. అయితే ఇలాంటి అభివృద్ధి కారకమైన ఉత్తేజాన్ని కలగజేయడంతోపాటు ఇది మనుషుల్ని జూదంలో పాల్గొనడం, డ్రగ్స్ వాడటం లాంటి చెడు సాహసాలవైపు కూడా ప్రేరేపిస్తుందని వారు హెచ్చరించారు.

తాటవలుస్తా జాగ్రత్త!''అంటూ పళ్ళు గిట్టకరిచాడు.

''క్షమించు గోవిందప్ప మావా! ఆడేదో కుర్రనాకొడుకు. తెలిసీ తెలియకా ఏదో వాగుతాడు'' అని సర్దిచెప్పాడు, అతనికంటే కాస్త చిన్నవాడైన పుల్లారావు.

గోవిందప్ప మళ్ళీ మామూలు మూడ్‌లోకి వచ్చేశాడు. ''ఇంతకీ ఈరిగాడు నీకెక్కడ కనిపించేడురా?'' అని ఆసక్తిగా అడిగాడు. రెడ్డొచ్చాడు, మొదలెట్టు అన్నట్లు ఎల్లన్న మళ్ళీ చెప్పేడు.

''నీ మొహం మండా! చచ్చినోడు మళ్ళీ ఎట్టా కనిపిస్తాడురా! ఇట్టాంటి పోసికోలు కబుర్లు చెప్పి, జనాన్ని భయపెట్టడానికి కాకపోతే నువ్వు ఇక్కడుండి చేసేదేందిరా!'' అని గోవిందప్ప అనేసరికి, ముఖం మాడ్చుకున్న ఎల్లన్న భయంతో రెండడుగులు వెనక్కి వేశాడు.

టీకొట్టు సుబ్బడు పొగలుకక్కే వేడి వేడి టీ గ్లాసులు అందరికీ అందించాడు.

ఓ గుక్క టీ తాగి, ''ఆహా! టీ అమృతంలా చేసినావ్‌రా!'' అంటూ గోవిందప్ప పొగిడేసరికి, సుబ్బడి ఛాతీ బెలూన్‌లా పొంగింది.

''ఎదవన్నర ఎదవ, టీ ఇంత బాగా ఎలా చేసినావ్‌రా!'' అని ఆయన మళ్ళీ అనేసరికి అది పొగడ్తో తెగడ్తో అర్థంకాని సుబ్బడి ఛాతీ, గాలి తీసేసిన బెలూన్‌లా అయిపోయింది.

అతని చుట్టూ కూర్చున్న మిగతా పెద్ద మనుషులు కూడా ఎందుకైనా మంచిదని కాస్త దూరం జరిగారు.

''ఐనా, మోహినిని అని ఏందిరా లాభం, మన ఎదవలకి బుద్ధి వుండాలి గానీ!'' ఉపోద్ఘాతంలా అన్నాడు గోవిందప్ప, చుట్టను అడ్డంగా తిప్పి నుసి విదిలిస్తూ.

ఎవరూ మాట్లాడలేదు.

కొన్ని క్షణాలు అందరివైపూ చూసి మళ్ళీ తనే అన్నాడు. ''ఒళ్ళంతా తిమ్మిరెక్కిపోయి ఒళ్ళూ పై తెలీక పైట కనిపించింది కదాని ఎగేసుకెళ్తే అట్టాగే వుంటాది మరి! ఇందులో మోహిని పిశాచాన్ని తప్పుబట్టాల్సిన పనిలేదు. దాని కోరిక అది తీర్చుకుని, చంపి చక్కాపోయింది''

''అదెక్కడికి పోద్దిమావా, ఈ ఊరిని వల్లకాడు చేసిగానీ అదెక్కడికీ పోదు! మొన్నటికి మొన్న సుబ్బారాయుడుగారబ్బాయి రాత్రివేళ పొలం నుంచి వస్తుంటే, దారికాసి మరీ వెంట తీసుకుపోయింది. వాణ్ణి పీల్చి పిప్పి చేసిగానీ వదల్లేదు. బలంగా ఆరోగ్యంగా వుండే మడిసి, శవంలా అయిపోయాడు'' చెప్పాడు పుల్లారావు.

మోహినీ పిశాచి దృష్టి పడినోడు ఏనుగులా వున్నాసరే పీనుగులా అయిపోతాడనేది పల్లెల్లో వాడుకలో వున్న నమ్మకం. దాన్నే కామినీ పిశాచి అని కూడా పిలుస్తూ వుంటారు. కామవాంఛ తీర్చుకునే మోహినీ పిశాచం మగాడి ద్వారా ప్రతిరోజూ తన వాంఛ తీర్చుకుంటూ ఉంటుంది. మోహినీ పాలబడిన వ్యక్తి రోజురోజుకూ శారీరకంగా క్షీణించిపోతూ వుంటాడు. రక్తం తగ్గిపోతూ ముఖం పాలిపోతుంది. కండ కరిగిపోతుంది. ఎముకలకి చర్మం అతుక్కుపోయి, పీనుగులా మారిపోతాడు. అలా నలభై రోజుల పాటు మోహిని వాంఛలు తీర్చిన పురుషుడు, పై లోకాలకు పయనం కడతాడు.

ఆ విషయాలు జ్ఞాపకం వచ్చేసరికి ఎల్లన్న, టీకొట్టు సుబ్బడు సన్నగా భయంతో వణికారు. మిగతావాళ్ళు భయాన్ని కప్పిపుచ్చుకోవడానికి అరచేతులు రుద్దుకున్నారు.

''నిన్నటికి నిన్న పెదిరెడ్డిగారి పోరగాణ్ణి పీల్చి పిప్పి చేసింది. వాడిప్పుడు రేపోమాపో అన్నట్టు చావుబతుకుల్లో వున్నాడు'' అని చెప్పాడు ఎల్లన్న.

''ఏందిరా నువ్వు, ఎదవ సచ్చినోడ! ఇందాకట్నించీ చూస్తున్నాను, చెప్పినా కూడా ఇనకుండా ఆ కబుర్లే చెప్పి కుర్రగాళ్లని వూరికే భయపెడతావేందిరా!'' అంటూ గోవిందప్ప తాచుపాములా కస్సున లేచేసరికి అందరి నోళ్ళూ మూతపడ్డాయి. అక్కడి వాతావరణమంతా గంభీరంగా మారిపోయింది.

మళ్ళీ మళ్ళీ ఆ విషయాల గురించి అడిగేదీ ఆయనే! చెప్పవద్దంటూ అమ్మనా బూతులూ తిట్టేదీ ఆయనే! 'ఈ పెద్దమడిసితో ఎట్టా చావాలిరా!'

అన్నట్టుగా అందరిముఖాల్లోనూ ఒక విధమైన నిరసన భావం ప్రస్ఫుటంగా కనిపించింది. కానీ గోవిందప్పను ఎదిరించి మాట్లాడే దమ్ము అక్కడున్నవాళ్లల్లో ఒక్కడికీ లేదు.

***

చీకటి బ్రహ్మరాక్షసిలా ఆ ఊరును కమ్ముకుంది.

ఊరి ప్రజలంతా ఇళ్ల తలుపులు బిగించుకున్నారు.

చీకటి పడిందంటే చాలు, ఆ వూరి వాళ్లల్లో భయం కనురెప్ప పడనివ్వడం లేదు.

కంటిమీద కునుకు రానివ్వడం లేదు.

కనీసం కిటికీ తెరిచి చూసే ధైర్యం కూడా ఎవరికీ లేదు.

కనుచీకట్లు ముసురుకునే వేళకే అందరూ ఇళ్లకి చేరుకుంటున్నారు. పంటపొలాల్లో కాపలాని గాలికొదిలేసి, పడకటింట్లో ముసుగులు పెట్టుకుని పడుకుంటున్నారు.

వంద ఇళ్ళు విసిరేసినట్టుగా వున్న ఆ వూళ్ళో ప్రస్తుతం మోహినీ పిశాచి భయం దావాలనంలా వ్యాపించి తిష్ట వేసుకు కూర్చుంది.

పొరపాటున ఎవరింట్లోనైనా కుర్రవాళ్ళు మోహినీ పిశాచం గురించి ప్రస్తావన తీసుకొస్తే చాలు, పెద్దవాళ్ళు వాళ్లని కొట్టినంత పని చేస్తున్నారు. పనికిరాని కబుర్లు మాని చదువుకోమని పిల్లల్ని దబాయిస్తూ, భయాన్ని కప్పిపుచ్చుకుంటున్నారు.

సరిగ్గా అలాంటి సమయంలో ఊరికి ఉత్తరంగా ఉన్న సవుకు తోపులో చీకటి దెయ్యంలా వున్న మర్రిచెట్టులోంచి బయటికి వచ్చింది మోహినీ పిశాచం.

మల్లెపువ్వులాంటి తెల్లటి చీర, విరబోసుకున్న జుట్టు, కాళ్ళకి గజ్జెలు, గాలిలో తేలుతున్న పాదాలు, విశాల నేత్రాలు.

ఆమెని ఆ స్థితిలో చూస్తే, ఎంతటి ధైర్యవంతుడికైనా నవనాడులూ కృంగిపోతాయి. వేగంగా వీస్తున్న గాలికి ఆమె జుట్టు అల్లల్లాడుతోంది.

మర్రి ఊడలు కూడా అలాగే ఊగుతున్నాయి.

ఆకాశంలో నిండుచంద్రుడు ధగధ్ధగాయమానంగా ప్రకాశిస్తున్నాడు. ఆ వెలుతురులో, కోరికతో ఎగసిపడుతున్న కాంక్ష ఆమెలో జ్వాలలా కనిపిస్తోంది.

ఇప్పుడామెకి ఒక మనిషి కావాలి. సంపూర్ణ శరీరారోగ్యం వున్న ఒక కాపురుషుడు కావాలి. తన కోర్కెల సెగల్ని చల్లార్చి, తనలో ఐక్యమైపోయే ఒక కాముకుడు కావాలి. తనకు శక్తినందించి, శక్తిహీనుడుగా మారడానికి పురుషరూపంలో వున్న ఒక బలిపశువు కావాలి.

పెద్ద పెద్ద అంగలేసుకుంటూ ముందుకు నడుస్తోందా మోహినీ పిశాచం.

కనుచూపు దూరంలో ఎక్కడా ఆమెకి పురుషుడన్నవాడు కనిపించడం లేదు.

కోర్కెల ఉధృతికి తట్టుకోలేక ఆమె చాలా అసహనంగా వుంది.

సరిగ్గా అదే సమయానికి చెప్పాపెట్టకుండా వర్షం మొదలైంది. జల్లుగా కురవసాగింది.

ఉండి ఉండి మేఘాల్లో మెరుపులు మెరుస్తున్నాయి.

ఆ మెరుపుల వెలుగులో పుంత దారి వెంట నడిచి వస్తున్న ఒక బాటసారిపై పడిందామె దృష్టి.

మరుక్షణం ఆమె పెదాలమీద సన్నటి నవ్వు విరిసింది. బలిపశువు దొరికిందన్న ఆనందోత్సాహానికి చిహ్నమది.

వడివడిగా నాలుగడుగులు వేసిందా పిశాచం.

అప్పటికి ఆమె సమీపానికి వచ్చిన ఆ బాటసారి తల తిప్పి, శ్వేతవస్త్రాల్లో ఆమెను చూసేసరికి ఒక్క క్షణం జడుసుకున్నాడు.

కండలు తిరిగిన శరీరంతో బలంగా, అందంగా ఉన్న ఆ యువకుణ్ణి చూసేసరికి, ఆమె కళ్ళు అప్రయత్నంగా మెరిశాయి.

మేఘాల మెరుపులే ఆమె కళ్లల్లో ప్రతిఫలించాయనుకున్నాడతడు. లేదంటే, అతడికి కనీసం ఆమెపై అనుమానం కలిగేది.

కళ్ళు చెదరగొట్టే ఆమె అందానికి ముగ్ధుడైపోతూ ముందుగా అతడే మాట్లాడేడు. ''ఎవరు మీరు, ఇంత రాత్రివేళ ఇక్కెడెందుకున్నారు?'' అని ప్రశ్నించాడు. అతడు ఆ ఊరివాడే, ఇంకా పెళ్లికాలేదు. ఉద్యోగరీత్యా కొంతకాలంగా పట్నంలో ఉంటున్నాడు. దాదాపు పల్లెకొచ్చి ఓ సంవత్సరం కావడంవల్ల, అతడికి అక్కడి విషయాలేవీ తెలియవు.

దారిలో బస్సు ఆలస్యం కావడం వల్ల చీకటి పడిపోయింది. ఆ ఊరికి ఆ సమయంలో బస్సులు కూడా లేకపోవడం వల్ల, నాలుగు కిలోమీటర్ల నుంచి పుంత దారి వెంట నడిచి వస్తున్నాడు.

అతడి ప్రశ్నకు ఆమె ఉలిక్కిపడి వెంటనే సర్దుకుంది. ''నా పేరు మోహిని...'' అంటూ అతడి కళ్లల్లోకి సూటిగా చూసింది.

ఆ చూపులు అయస్కాంత క్షేత్రాల్లా ఆకర్షిస్తున్నా, వాటి తీక్షణతకు తట్టుకోలేక అతడు కాస్త తడబడ్డాడు.

''నేను పట్నంలో పని వుండి స్నేహితురాల్ని తోడు తీసుకుని వెళ్లాను. మా పనులు పూర్తిచేసుకుని, సరదాగా ఇద్దరం సినిమా చూసి వస్తున్నాం. ఈలోగా చిన్ననాటి స్నేహితురాలు కలిసి, ఆమెని ఆపేసి వాళ్లింటికి తీసుకుపోయింది. నన్ను కూడా రమ్మంది. కానీ నాకు ఇంటిదగ్గర ముఖ్యమైన పని వుండడం వల్ల నేను రాలేనన్నాను. బస్సు ఎక్కి వచ్చేశాను. ఒక్కదాన్నీ పుంతదారి వెంట భయం భయంగా నడిచి వస్తున్నాను'' అని అప్పటికప్పుడు ఓ కథ అల్లి చెప్పేసిందామె.

అతడు తల వూపి, సడెన్‌గా అడిగాడు. ''మీరు బస్సు దిగడం నేను చూడలేదే!''

మోహిని గతుక్కుమని చూసింది ''మీ ముందే నడిచి వచ్చాను, నేనూ మిమ్మల్ని గమనించలేదు'' అంది.

ఉరుములు మెరుపులతో ఆకాశం గర్జించింది.

సన్నగా మొదలైన వర్షం ఉధృతంగా మారింది.


''వర్షం పెరిగింది. రండి ఇక్కడికి దగ్గరలో ఒక ఇల్లుంది. వర్షం తగ్గేవరకూ అక్కడ వుండొచ్చు'' మోహిని చొరవగా అంది.

ఏదో తెలీని ఆకర్షణ అతణ్ణి ఆమె వైపు లాగుతోంది. అప్రయత్నంగా ఆమె వెనకే అడుగులు వేశాడు అతడు.

మర్రిచెట్టు పక్కగా అతణ్ణి తీసుకుపోతోంది ఆమె.

వెన్నెల వెలుగులో గాలికి వూగుతున్న మర్రిచెట్టు ఊడలు, జడలు విరబోసుకున్న దయ్యాల్లా వున్నాయి.

చెట్టుకొమ్మ మీద గుడ్లగూబ చక్రాల్లాంటి తన



కళ్లతో వాళ్లిద్దర్నీ ఓసారి చూసి, రివ్వున ఎటో ఎగిరిపోయింది.

కాస్త దూరం నడిచిన వాళ్లిద్దరూ స్మశానాన్ని సమీపించారు. దాన్ని ఆనుకుని వుంది, ఒక పాడుబడిన ఇల్లు. అక్కడక్కడా పెంకులు వూడిపోయి, ఒక స్తంభం కూలిపోయి శిధిలావస్థలో వుందది.

అది చిన్నతనం నుంచీ తెలిసిన ఇల్లే కావడం వల్ల ఏదో తెలీని భయంతో అతడి వెన్ను జలదరించింది.

స్మశానానికి దగ్గరగా వుండడం వల్ల మానసిక అశాంతికి గురైన ఆ ఇంటి యజమాని, దాన్ని గాలికొదిలేసి, తన కుటుంబాన్ని తీసుకుని పట్నం వెళ్లిపోయాడు. అప్పటినుంచీ అది పాడుబడిన కొంపగా మిగిలిపోయింది. చిన్నతనంలో స్నేహితులతో అతడు ఆ ఇంటి సమీపంలో ఆడు కుంటూ జ్వరం పట్టుకోవడం వల్ల పెద్దలు దెబ్బలాడేసరికి అప్పటినుంచీ అతడెప్పుడూ మళ్లీ ఆ కొంప ఇరుపంచలకు కూడా వెళ్లలేదు. ఆనాటినుంచీ ఆ కొంపలో దయ్యాలు తిరుగుతుం టాయనే ప్రచారం ఎక్కువైపోయింది.

ఆ గాలికొంపను సమీపించేసరికి అతడిలో భయం పాదరసంలా ప్రవహించి, ఒళ్ళంతా పాకి, ఏదో తెలీని గగుర్పాటుకు గురిచేసింది.

ఆ ఇంట్లోకి వెళ్లడానికి భయంగానే వున్నా, ఆమె ఆకర్షణలో పడిపోయిన ఆతడు భయాన్ని గాలికొదిలేసి దుమ్మూధూళితో వున్న మెట్లెక్కి ఆమె వెనకే అడుగులు వేశాడు.

అతడి మనసు చదివినట్టుగా ''లోపలైతే జల్లులు కొట్టకుండా వుంటాయి'' అని మోహిని అనేసరికి, ఆతడు ఉలిక్కిపడ్డాడు.

ఒక గది దాటి రెండోగదిలోకి అతణ్ణి తీసుకు వెళ్లిందామె.

దుమ్మూధూళితో పాటు, అక్కడక్కడా మూల మూలల్లో సాలె పురుగులు గూళ్ళు అల్లుకుని, ఎరల కోసం అన్వేషిస్తున్నాయి.

ఆమెకి ఎర దొరికింది గానీ, సాలె పురుగుకి ఇంకా ఆ సమయం రాలేదు.

గది మధ్యలో పెద్ద మంచం, దానిమీద పరుపు, తలదిండ్లు వున్నాయి.

దుప్పటి లేని ఆ మంచాన్ని చాలాకాలంగా వాడుతున్నదానికి గుర్తుగా పరుపుల మీద, తలదిండ్లు మీద అక్కడక్కడా మాసికలు పట్టి వున్నాయి.

ఓ మూల, కాస్త ఎడంగా విచ్చుకున్న గోడ పగులులోంచి వెన్నెల కాంతి సన్నగా లోపలికొస్తోంది. ''అక్కడ కూర్చుందామా, వెచ్చగా వుంటుంది'' అంది ఆమె.

అతడు తల వూపాడు.

ఇద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు.

ఓరగా అతడి వైపు చూసింది మోహిని.

కాస్తంతగా తడిసిపోవడం వల్ల అతడు సన్నగా వణుకుతున్నాడు.

''చాలా చలిగా వుంది కదూ!'' అంటూ అదోరకంగా చూసి నవ్వుతూ, ఆమె అరచేతులు రుద్దుకుంది.

''ఔను'' అని నవ్వి, అతడు కూడా అరచేతులు రుద్దుకున్నాడు.

''ఇంతకీ మీ పేరు చెప్పలేదు'' అంది మోహిని.

''సంపత్...'' చెప్పాడు అతను.

''మీ పేరు చాలా బావుంది'' అంటూ అదోరకంగా చూసింది.

''మీపేరు కంటేనా!'' అంటూ కాంక్షగా నవ్విన అతడికి సడెన్‌గా గుర్తొచ్చింది. ''ఇంతకీ మీరు ఎవరి తాలూకు, ఇంతకుముందెన్నడూ మిమ్మల్ని చూసిన గుర్తులేదు!'' అన్నాడు.

''ఔను, నిజమే నేను మీకు తెలిసే అవకాశం లేదు. నేను ఎలిమెంటరీ స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్నాను. ఈమధ్యనే మీ వూరికి వచ్చాను'' అంటూ మరో కథ కల్పించి, అసంపూర్తిగా మాటలు ముగించింది.

సంపత్ మౌనంగా తల పంకించాడు.

సరిగ్గా అదే సమయానికి కిటికీలోంచి వేగంగా వీచిన గాలికి ఆమె పైట తొలగిపోయింది.

పయ్యెదలోంచి తడిసిన ఆమె ఎదపొంగులు రెచ్చగొడుతున్నట్టుగా కనిపించేసరికి, ఆతడిలో కోరిక చెలరేగింది.

సభ్యత కాదని, తల తిప్పుకుని మౌనంగా కూర్చున్నాడు సంపత్.

అది గమనించిన మోహిని నర్మగర్భంగా నవ్వి, అలాగే లేచి వెళ్లి కిటికీ రెక్క మూసి వెనక్కి తిరిగింది.

మరుక్షణం ఆమె పైట మొత్తం కిందికి జారిపోయింది. మోహిని అదేమీ పట్టించుకోవడం లేదు.

కోర్కె రేపిన సెగలకు ఆమె అణువణువూ దహించిపోతోంది.

లోపల జ్వలిస్తున్న సెగలు ఆమె కళ్లల్లో రగులుతున్నాయి.

మోహిని అక్కడినుంచి కదలలేదు. అతడి కళ్లల్లోకి సూటిగా, కసిగా చూసింది.

ఆ చూపుల్ని ఆతడు తట్టుకోలేకపోతున్నాడు. సభ్యత సరిహద్దుల్ని దాటడానికి కాస్త సంశయిస్తున్నాడు.

''ఇలాంటి అద్భుతమైన వాతావర "న్ని నిర్వీర్యం చేసే మగమహారాజు ఎవడైనా వుంటాడా?'' అంటూ ఆమె నుంచి సంకేతం అందేసరికి అతడిలో కాంక్ష చెలరేగింది. సమ్మోహనంగా చూసిన ఆమె చూపులకు అతడికి మైకం కమ్మినట్టయింది. అసంకల్పిత ప్రతీకార చర్యలా పైకి లేచి, ఆమెని సమీపించాడు.

మరుక్షణం చేతులు చాచి మోహిని ఆహ్వానం పలికేసరికి ఆమెని బిగికౌగిలిలో బంధించాడు.

సంపత్‌ని మంచం మీదకి తోసి, కాలనాగులా అతణ్ణి అల్లుకుపోయింది మోహిని.

* * *


అప్పటికి సంపత్ ఆ ఊరికొచ్చి వారంరోజు లయింది.

రక్తం రుచి మరిగిన పులిలా, మోహినితో ఆ సుఖానికి అలవాటుపడిపోయిన ఆతడు ప్రతిరోజూ పాడుబడిన ఆ ఇంట్లో ఆమెని కలిసి వస్తున్నాడు. ఉళ్ళోవాళ్ళెవ్వరికీ అనుమానం రాకుండా ప్రవర్తిస్తూ, మోహిని పైశాచిక వాంఛల్ని తీరుస్తూ రోజురోజుకీ చిక్కి శల్యమైపోతున్నాడు.

ఇరవై రోజులు గడిచాయి.

అప్పటికే సంపత్ కళ్ళు గుంటలు పడి, కండలు కరిగిపోయి, ఎముకల గూడులా కనిపిస్తున్నాడు.

ఊరి జనానికి అప్పుడొచ్చింది అనుమానం. తరచి తరచి అతణ్ణి ప్రశ్నించినా సరైన జవాబు చెప్పలేదు. మోహినిని కలవడం మానడం లేదు.



అతడి బంధువులు సంపత్‌ని వెళ్లకుండా అడ్డుకోవాలని చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. వాళ్లనుంచి తప్పించుకుని వెళుతూ, మోహిని రాక్షసవాంఛల్ని తీరుస్తున్నాడు.

రోజురోజుకీ ఆరోగ్యం క్షీణించిపోతున్నా సరే లెక్కచేయక, పీనుగులా వెళుతూ ఆమెని కలుస్తూనే వున్నాడు.

మోహిని సమక్షం అతడికో వ్యసనంగా మారింది.

* * *

''ఏంది ఎల్లన్నా నువ్వు చెప్పేది. సంపత్ బాబు చచ్చిపోయింది ఆ మోహినీ పిశాచం వల్లా!'' అంటూ తెల్లముఖం వేశాడు కొండయ్య. నమ్మలేనట్టు ఆ మాట మళ్ళీ అడిగాడు.

అప్పుడే చుట్టతీసి ముట్టించిన గోవిందప్ప అలవాటు ప్రకారం కస్సుమని లేచాడు. ''ఛస్... నీకెన్నిసార్లు చెప్పాల్రా ఎర్రి ఎదవా! ఒక్కసారి చెప్తే అర్థమై చావదా!''

ఆ మాటలకి ముఖం ముడుచుకున్న కొండయ్య, తాగుతున్న టీ గ్లాసు పట్టుకుని కాస్త పక్కకి జరిగాడు.

చుట్టపొగ పీల్చి, హాయిగా బయటికి వదులుతూ ''ఆ...ఏందిరా ఎల్లన్నా, ఇప్పుడు చెప్పు! సంపత్‌బాబు సచ్చిపోయింది కామినీ పిశాచం వల్లనా!'' అన్నాడు ఆశ్చర్యం ప్రకటిస్తూ.

కొండయ్యకి నోటివరకూ వచ్చిన మాట ఆగిపోయింది. 'ఎందుకొచ్చిందిలే, ఏమన్నా అంటే గింటే అమ్మనా బూతులు తిడతాడు' అనుకుని, మాటని గొంతులోనే తొక్కిపెట్టేశాడు.

గోవిందప్ప పక్కకొచ్చి కూర్చున్న పుల్లారావు మాత్రం మెల్లగా మాట కలిపి ''ఇంతకీ, సంపత్‌బాబుని ఆ మోహినీ దెయ్యమే చంపేసిందంటావా మావా...'' అన్నాడు ఆసక్తిగా.

''ఏది సంపితే నీకెందుకురా సన్నాసి ఎదవా! ఎప్పుడు చూసినా సావుల గొడవే, ఇనలేక సచ్చిపోతున్నాం!'' అంటూ కసురుకునేసరికి, పుల్లారావుకి నోటమాట పడిపోయింది.

సరిగ్గా అదే సమయంలో, కొత్త సినిమా చూడండంటూ గగ్గోలు ఎత్తించే సినిమా రిక్షా, పోలీసువారి ప్రకటన వినిపించుకుంటూ అటు వైపు వచ్చింది. ''పురజనులకు ముఖ్యమైన ప్రకటన! గత కొద్దికాలంగా మన పల్లెలో మోహినీ పిశాచం పేర జరుగుతున్న ప్రచారం, వూరు వూరంతా బెంబేలెత్తిపోతున్న విషయం అందరికీ తెలిసిందే. కానీ అదంతా ఒట్టి పుకారు తప్ప మరింకేమీ కాదని తేలిపోయింది. పట్నం నుంచి ఓ పిచ్చిపిల్ల పారిపోయి వచ్చిందట. మన వూరి అమాయక ప్రజలు దాని వలలో పడి, మరీ ఛస్తున్నారని పిచ్చాసుపత్రి వైద్యుల వల్ల నిజాలు బట్టబయలైనాయి. అందువల్ల, మోహినీ పిశాచం గురించి ఏదేదో ఊహించుకున్న మన వూర్ధి జనం ఇక ముందు ఎంతమాత్రం భయపడాల్సిన పనిలేదు. అలాగని దాని జోలికి మాత్రం పోకండి ఆ పిచ్చిది మీకు ఎక్కడ కనిపించినా, మీకు సమీపంలో వున్న పోలీసు స్టేషనులో తెలియ జేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం'' అంటూ మళ్లీ మళ్లీ ప్రకటిస్తూ వెళ్లిపోయిన సినిమా రిక్షాను చూస్తూ టీ పాక ముందున్న అందరూ వెర్రిముఖాలు వేసుకుని చూస్తున్నారు.


చాలాసేపటికి ముందుగా తేరుకున్నవాడు గోవిందప్ప.

''ఏందిరా, ఎర్రినాగన్న ఎదవన్నర ఎదవల్లారా! ఇలాంటిదేదో వుండి తీరుతుందని నేను ముందే అనుకున్నాను. ఎవుడైనా నన్ను మాట్లాడనిత్తే కదా! ఏదేదో ఊహించుకుని సత్తన్నారు సన్నాసులు. మోహినీ పిశాచం పట్టినోళ్లలా ఒకటే ఎదవ గోల!'' అంటూ తాచుపాములా లేచిన గోవిందప్పను చూసి, పక్కనే టీ తాగుతూ కూర్చున్న వాళ్లంతా వెర్రిముఖాలు వేసుకుని చూశారు.

పట్నం నుంచి ఓ పిచ్చిది తప్పించుకుని పారిపోయిన మాట నిజమే, కానీ కొన్ని నెలల క్రితమే ఆమెని పట్టుకుని పిచ్చాసుపత్రికి చేర్చేశారనే నిజం వాళ్ళెవరికీ తెలీదు. ఆ విషయం తెలిసినా, ప్రజల్లో అనవసర భయాలు రేకెత్తించకూడదని పోలీసులు మిన్నకుండిపోయారు. భయం తగ్గించడానికి పిచ్చిదాని కథనే మళ్ళీ మళ్ళీ వినిపిస్తున్నారు.

సరిగ్గా అదే రోజు రాత్రి అలవాటు ప్రకారం సవుకు తోపు దగ్గరున్న మర్రిచెట్టులోంచి బయటికొచ్చిన మోహిని, ఎరకోసం పుంతదారి దగ్గర కాపు కాసింది.

❑



## లెక్కల భయానికి కారణం!

ఇటీవల ఘన విజయం సాధించిన బాలీవుడ్ చిత్రం 'తారే జమీన్ పర్'లో ప్రధాన పాత్ర అయిన ఎనిమిదేళ్ళ కుర్రాడి సమస్య చాలామందికి గుర్తుండే ఉంటుంది. 'డిస్ లెక్సియా' వ్యాధి కారణంగా ఆ కుర్రవాడు అక్షరాలకూ అవి ప్రాతినిధ్యం వహించే అర్థాలకూ మధ్య సమన్వయం కుదుర్చుకోలేక ఇబ్బంది పడతాడు. ఫలితంగా చదువులో వెనుకబడతాడు. తల్లిదండ్రులు అతని సమస్యను వ్యాధిగా గుర్తించక నిర్లక్ష్యం వల్లే అతను సరిగ్గా చదవ లేకపోతున్నాడని అతనిపై ఒత్తిడి తెస్తారు. చివరకు ఒక టీచర్ ఆ కుర్రాడిది నిర్లక్ష్యం కాదని, ఒక వ్యాధి అనీ గుర్తిస్తాడు. అతని చొరవ వల్ల ఆ కుర్రవాడిలో దాగి ఉన్న ప్రతిభ మరో కోణంలో బయటకు వస్తుంది. కథ సుఖాంతం అవుతుంది. ఐన్‌స్టీన్, డావిన్సీ, వాల్ట్ డిస్నీ, పికాసో లాంటి ఎందరో ప్రముఖులు ఈ వ్యాధితో బాధ పడ్డవారే. అయినా వేరే రంగాల్లో తమ ప్రతిభ నిరూపించుకున్నారు. ఇటీవలి వరకూ ఈ వ్యాధి గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. ఆ సినిమా తరువాత చాలామంది తల్లిదండ్రుల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన ఏర్పడిందనే చెప్పాలి. దీనిని నయం చేసే వైద్య విధాలనాల పట్ల కూడా అవగాహన పెరిగింది. అయితే 'డిస్ లెక్సియా' కన్నా అధికంగా వ్యాపించిన వ్యాధి మరొకటుందని అంటున్నారు శాస్త్రవేత్తలు. క్యూబాలో 1500 మంది పిల్లలపై జరిపిన పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది. ఈ వ్యాధి పేరు 'డిస్ కాల్‌క్లియా'. దీనితో బాధపడే పిల్లలు సంఖ్యా సంబంధమైన లెక్కల్ని సరిగ్గా చేయలేరు. సంఖ్యలను గుర్తించడంలోనూ, వేర్వేరు సంఖ్యల మధ్య విలువల భేదాన్ని గుర్తించడంలోనూ వీరు ఇబ్బందికి గురౌతారు. లెక్కలు చేయడానికి కష్ట పడతారు. 'డిస్ లెక్సియా'తో బాధపడే పిల్లలు 4.3 శాతం మంది ఉంటే 'డిస్ కాల్‌క్లియా'తో బాధ పడేవారు 6 శాతం వరకూ ఉన్నారని ఈ పరిశోధనల్లో తేలింది. కాబట్టి మీ పిల్లలు లెక్కలంటే భయపడుతుంటే, వారు సరిగా శ్రద్ధ పెట్టడం లేదని భావించక వారెందుకు ఆ భయానికి గురౌతున్నారో తెలుసుకోండి.